సాక్షి ఒడిశా

గురువారం । 31 । జులై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,31,586లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 68గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అధికారులకు అవార్డులు

రాజధాని భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవనంలో బుధవారం ఆకాంక్ష జిల్లాల కలెక్టర్లు, సమితి కేంద్రాల అధికారులకు సీఎం మాఝి బుధవారం పురస్కారాలు అందజేశారు.

- 8లో



9న ఆదివాసీ దినోత్సవం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు తొమ్మిదో తేదీన ఘనంగా నిర్వహించాలని జయపురం ఆదివాసీ సంఘాలు నిర్ణయించాయి.

- 8లో

పక్కాగా సహాయక చర్యలు

- వరద ప్రాంతాల ఏరియల్ వ్యూలో సీఎం మోహన్‌చరణ్ మాఝి
- 3 జిల్లాల్లో 8 మండలాలు మునక
- 81 గ్రామాల్లో 30 వేల మందిపై ప్రభావం



లోక్ సేవా భవన్‌లో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష



వరద ప్రాంతాల ఏరియల్ వ్యూ సందర్శనలో ముఖ్యమంత్రి

భువనేశ్వర్: వరద సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్ జిల్లాల్లో వరద పరిస్థితిపై బుధవారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ఆయనతో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ప్రత్యేక సహాయ కమిషనర్ దేవ్ రంజన్ కుమార్ సింగ్ ఉన్నారు. ప్రభావిత జిల్లాల్లో వరద పరిస్థితిని ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ నేపథ్యంలో స్థానిక లోక్ సేవాభవన్‌లో అనుబంధ విభాగాల, శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. 3 జిల్లాల్లో 8 మండలాల 81 గ్రామాలు వరద ప్రభావానికి గురైనట్లు తెలిపారు. బాలాసోర్ జిల్లాలో 4 మండలాలు బొస్తా, బలియాపాల్, భోగరాయ్, జలేశ్వర్, భద్రక్ జిల్లాలో 2 మండలాలు దామ్‌నగర్, భండారిపోఖరి, జాజ్‌పూర్ జిల్లాలోని 2 మండలాలు జాజ్‌పూర్,దశరథ్‌పూర్ ప్రభావితమైనట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వరదల వల్ల దాదాపు 30 వేల మంది ప్రభావితం అయ్యారని చెప్పారు. వరద ముంపుతో ప్రభావితమైన ప్రాంతాల నుంచి 5,869 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. ప్రస్తుతం వివిధ నదులలో నీటి మట్టం క్రమంగా తగ్గుతోందని, బాలాసోర్ జిల్లాలో సువర్ణ రేఖ, జలకా నదులలో నీటి మట్టం తగ్గుగుముఖం పడుతోందన్నారు. ప్రస్తుతానికి వరద పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, కెందుఝొరొ, మరికొన్ని జిల్లాల్లో వరదలు వచ్చినప్పటికీ గణనీయమైన ప్రభావాన్ని చూపలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని బట్టి బాధిత ప్రజలకు అటుకులు, బెల్లం పొడి పదార్థాలు, అవసరమైతే వండిన తాజా ఆహార సరఫరా మరో 7 రోజులపాటు నిరవధికంగా కొనసాగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాలాసోర్‌లో 16, భద్రక్‌లో 10, జాజ్‌పూర్‌లో 3 ఉచిత వంట శాలలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీటి ఆధ్వర్యంలో 10 వేల మంది బాధిత ప్రజలకు వండిన ఆహారాన్ని అందజేస్తున్నామన్నారు. వరదల తదనంతర సమస్యలు నేపథ్యంలో యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అతిసార, ఇతర నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ, నీటి వనరులను శుద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.



వరద ప్రభావిత ప్రాంతాలు

సత్వర నివేదిక ఆదేశాలు..

వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని తక్షణ అంచనా వేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. కలెక్టర్ల నివేదిక ఆధారంగా బాధిత ప్రజలకు తగిన సహాయం అందజేస్తామన్నారు. కూలిన ఇల్లు, పాడి పశువుల పరిహారం, గ్రామీణ ప్రాంతాల్లో వరద కోతకు గురైన రహదారుల మరమ్మతులు, ప్రధాన మార్గానికి అనుసంధాన కార్యకలాపాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. వరద ముంపుతో ప్రాణ నష్టం జరగకుండా చేపట్టిన చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బాలసోర్ జిల్లాలో 17 ఒడ్రాఫ్, 13 అగ్నిమాపక బృందాలను, భద్రక్ జిల్లాలో 1 ఎన్‌డీఆర్ఎఫ్, ఒక ఒడ్రాఫ్, 13 అగ్నిమాపక బృందాలను, జాజ్‌పూర్ జిల్లాలో 1 ఒడ్రాఫ్, 14 అగ్నిమాపక బృందాలను మోహరించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

న్యూస్‌రీల్

కొత్త కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ ప్రెసిడెంట్



కలెక్టర్ సత్యవాన్‌తో సస్మితా మెలక

కొరాపుట్: ఇటీవల కొరాపుట్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యవాన్ మహాజన్‌ను జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెనుకబడిన గిరిజన జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకులపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రి జిల్లా సమాచార, ప్రజాసంపర్క అధికారి ప్రమిశామాఝి గత ఏడాది నిర్వహించిన కార్యక్రమాల నివేదికను చదివి వినిపించారు. ఈ ఏడాది కూడా ఆమె నేతృత్వంలోనే దూమ్‌ధమ్‌గా నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీ ఉదయం 7.30 నుండి ఎనిమిది గంటల్లోపు ప్రతి ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలపై జాతీయ జెండాను ఎగురవేసి అనంతరం డీఎన్‌కే క్రీడా మైదానంలో నిర్వహించే జెండా ఆవిష్కరణ కోసం అతిథులను స్వాగతిస్తామన్నారు. ఈ ఏడాది పది, 12 తరగతుల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరించడం, పరేడ్ నిర్వహణపై చర్చించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ప్రశ్నపత్రాల లీకేజీలో ఉపాధ్యాయుడు అరెస్టు



బిజయ్ మిశ్రా (ఫైల్)

రాయగడ: ఒడిశా టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఓటీఈటీ) ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనకు సంబంధించి ఓ ఉపాధ్యాయుడిని ఒడిశా క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ప్రశ్నపత్రాలు లీకయ్యాయన్న వార్తలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ మేరకు ఈ పరీక్షలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు ప్రారంభించింది. జిల్లాలోని మునిగుడ సమితి పరిధిలో గల దొంగొరాబొడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బిజయ మిశ్రాను క్రైమ్ బ్రాంచ్ అధికారులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు.


బొగ్గు ఉత్పత్తిలో నంబర్ వన్



బొగ్గు గని

భువనేశ్వర్: బొగ్గు ఉత్పత్తి రంగంలో జాతీయ స్థాయిలో ఒడిశా అగ్రగామిగా నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం 269.36 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. 254.63 మిలియన్ టన్నుల బొగ్గు పలు ప్రాంతాలకు ఎగుమతి చేసింది. గత మూడు సంవత్సరాలలో ఏ విద్యుత్ ప్లాంట్ బొగ్గు కొరతను ఎదుర్కొలేదు. ఒడిశాలో బొగ్గు ఉత్పత్తి పెరుగుదల దేశానికి ప్రయోజనకరంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి.కిషన్ రెడ్డి పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

భద్రక్‌లో పాఠశాలలకు సెలవు



భద్రక్ ప్రాంతంలో వాన

భువనేశ్వర్: భద్రక్ జిల్లాలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా పాఠశాలలను మూసివేస్తున్నట్లు జిల్లా మెజిస్ట్రేట్ తెలిపారు. ధామ్‌నగర్, తిహిడి, బాసుదేవ్‌పూర్ ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేశారు.

విషాహారం తిని మహిళ మృతి



భీమే ముసాకి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బేజాంగివాడ పంచాయతీ బటిసీగూడలో విషాహారం తిని ఓ మహిళ మృతిచెందింది. భీమే ముసాకి(50) అనే మహిళ మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసింది. అర్ధరాత్రి వేళ ఆమె కేకలు వేయడంతో అందరూ వెళ్లి పరిశీలించారు. అప్పటికే నోటి నుంచి నురగలు రావడంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషాహారం తినడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని గుర్తించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందింది. ఐఐసీ ముకుందో మేల్కా దర్యాప్తు చేస్తున్నారు.

భువనేశ్వర్, ఝార్సుగుడ మధ్య విమాన సౌకర్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో విమానయాన సౌకర్యాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. త్వరలో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఝార్సుగుడ ప్రాంతానికి ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ సౌకర్యం ఆగస్టు 16 నుంచి అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ బుధవారం తెలిపారు. బి–మాన్ కార్యక్రమం కింద ఈ సౌకర్యాన్ని ప్రవేశ పెడుతున్నట్లు పేర్కొన్నారు. భువనేశ్వర్ – ఝార్సుగుడ మధ్య వారానికి 5 రోజులు మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి వారం పొడవునా ఈ సేవలు కల్పించే యోచన ఉన్నట్లు పేర్కొన్నారు.

జయపూర్ మహారాజతో గిరిజనులు భేటీ



రాజు చంద్రచుడ్‌తో నందపూర్ గిరిజనులు

కొరాపుట్: జయపూర్ మహారాజు విశ్వేశ్వర చంద్రచుడ్‌తో నందపూర్ గిరిజనులు భేటీ అయ్యారు. సూర్య వంశం రాజులు నందపూర్‌ని రాజధానిగా చేసుకొని పరిపాలించారు. అనంతరం నారాయణ పట్న, చివరకు జయపూర్‌ను రాజధానిగా మార్చుకొని పాలన సాగించారు. నందపూర్ రాజధానిగా ఉన్నప్పుడు 1932లో 32 మెట్ల సింహాసనం నిర్మించారు. దాని పైనుంచి రాజ దర్బార్ కొనసాగింది. ఇప్పటికీ ఈ సింహాసనం ఉంది. ఆ సింహాసనంపై 32వ మహారాజు వినాయక్ దేవ్, లీలావతి దంపతుల విగ్రహాలు పెట్టాలని గిరిజనుల విజ్ఞప్తి చేశారు. దీనిపై రాజు సానుకూలంగా స్పందించి విగ్రహాల ఏర్పాటుకు నిధులు పంపిస్తానన్నారు. అప్పట్లో రాజదర్బార్ ఉన్న భవనాన్ని బ్రిటీషర్లు ట్రెజరీ, తహశీల్దార్ కార్యాలయాలుగా వినియోగించుకున్నారు. నూతన భవనంలోకి ప్రభుత్వ కార్యాలయాలు మారడంతో ఆ రాజ భవనాన్ని మ్యూజియంగా మార్చాలని గిరిజనుల విజ్ఞప్తి చేశారు. రాజును కలిసిన వారిలో నందపూర్‌కి చెందిన ముున్న దళపతి తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- రాయగడ జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి



కలెక్టర్ కులకర్ణికి స్వాగతం పలుకుతున్న పాత్రికేయులు

రాయగడ: ఆదివాసీ, హరిజన ప్రాంతమైన రాయగడ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయలాంటే అందరి సహకారం అవసరమని జిల్లా నయతన కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అతనికి రాయగడ పాత్రికేయుల సంఘం బుధవారం కలెక్టర్‌లో అభినందించింది. సంఘం సాధారణ కార్యదర్శి శివాజీ దాస్ ఆధ్వర్యంలో సభ్యులు సురేష్ నాయక్, రాజేష్ కుమార్ మహంతి, అమూల్య నిషాంక, మనోజ్ మిశ్రా, ధరణీధర్ పట్నాయక్, సంఘం ముఖ్య సలహాదారుడు సురేష్ దాస్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కాసేపు కలెక్టర్ పాత్రికేయులతో ముచ్చటించి ఇక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత్రికేయుల దృష్టికి వచ్చిన సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని.. అందుకు అంతా సహకరించాలని కలక్టర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల మౌలిక వసతులకు సంబంధించి దృష్టికి వచ్చే సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

ఒత్తిడి జయిస్తేనే విజయం



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

రాయగడ: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురైతే చదువుతో పాటు ఆరోగ్యం దెబ్బతింటుందని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రాకేష్ రంజన్ పాడి అన్నారు. స్థానిక పితామహాల్‌లోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం మానసిక ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దన్నారు. మానసిక ఇబ్బందులను ముందుగానే గుర్తించి వాటి నివారణకు సహకరించాలని సూచించారు. టొల్ ఫ్రీ నంబరు 14416 ద్వారా కూడా సలహాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ విభాగం అధ్యాపకులు పి.రవితేజ, సునీల్ కర్, ప్రణతిదాస్, హిమాన్షు బెహరా తదితరులు పాల్గొన్నారు.

భాండాగారం చిత్రాల విడుదలపై ఆగ్రహం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం సముదాయంలో జగన్నాథుని రత్న భాండాగారం చిత్రాలను భారత పురావస్తు సర్వే సంస్థ ఏఎస్ఐ సాంఘిక మాధ్యమంలో విడుదల చేయడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి డాక్టర్ అరవింద కుమార్ పాఢి ఏఎస్ఐకి లేఖ రాశారు. రహస్యంగా ఉండాల్సిన శ్రీ మందిరం లోపలి ప్రాకారం ఫొటోలు అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ప్రసారం చేసిన వారిని గుర్తించి క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌ను కలుసుకున్న మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో

పర్లాకిమిడి: గజపతి జిల్లా కొత్త కలెక్టర్ మధుమితను బుధవారం మోహనా ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు దాశరథి గోమాంగో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజపతిజిల్లాలో ఆర్.ఉదయగిరి బ్లాక్ ఆకాంక్ష సమితిగా ముఖ్యమంత్రి పురస్కారం పొందినందుకు అభినందనలు తెలియజేశారు.

చెరువు పనులపై ఎమ్మెల్యే సమీక్ష



శంకర్‌బాస్ చెరువు, పార్కు పనులను ఇంజినీరుతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండ్ రోడ్డు శంకర్‌బాస్ చెరువు పునరుద్ధరణ పనులపై బుధవారం పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి సమీక్షించారు. ఐదేళ్లుగా కొనసాగుతున్న శంకర్‌బాస్ చెరువు, చుట్టు పక్కల పార్క్ పనులు సుమారు రూ.70 లక్షలతో పునరుద్ధరిస్తున్నారు. ఈ పనులను పీడబ్ల్యూడీ శాఖకు అందజేశారు. ఈ శంకర్‌బాస్ పనులను సకాలంలో పూర్తిచేయాలని రోడ్లు–భవనాల శాఖ ఇంజినీర్లను ఎమ్మెల్యే ఆదేశించారు.

సాంకేతికతను సద్వినియోగపరచుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: వరి సాగులో మూస ధోరణికి స్వస్తి పలుకుతూ రైతులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ ఉప సంచాలకులు టి.భవానీశంకర్ అన్నారు. బిర్లంగిలో రైతులకు డ్రోన్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ఒక ఎకరానికి మందు పిచికారీ చేసేందుకు కేవలం పది నిమిషాల సమయం పడుతుందన్నారు.

అధికారుల తీరుపై అసంతృప్తి



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు

జయపురం: సర్పంచ్‌లను అనేక విషయాలలో అధికారులు పట్టించుకోవటంలేదని కొట్‌పాడ్ సమితి సర్పంచ్‌ల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. కొట్‌పాడ్ సమితి సతరంగ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొట్‌పాడ్ సమితి సర్పంచ్ సంఘ సమావేశం బుధవారం జరిగింది. సంఘం అధ్యక్షుడు దేవ మఝి అధ్యక్షతన జరిగిన సమావేశం కొట్‌పాడ్ సమితిలోని అన్ని పంచాయతీల అభివృద్ధి, పంచాయతీ ప్రజలను అన్ని ప్రభుత్వ పథకాలలో మమేకం చేసే విషయంపై చర్చించింది. సర్పంచ్‌లను అనేక రంగాలలో నిర్లక్ష్యం చేస్తున్నారని పలువరు సర్పంచ్‌లు సమావేశంలో వెల్లడించగా సంఘం తీవ్రంగా స్పందించింది. సర్పంచ్‌ల పట్ల అధికారుల తీరుపై సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. కొట్‌పాడ్ సమితిలో ఉద్యోగులు, ఇంజినీర్లతో సర్పంచ్‌లు మంచి సంబంధాలు కలిగి, అభివృద్ధి కార్యక్రమాలలో సహకరించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. పంచాయతీ సిబ్బంది సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేయాలని విజ్ఞప్తి చేసింది. రానున్న రోజులలో పీఈఓల (పంచాయతీ కార్యనిర్వాహక అధికారి) అందరితో ప్రతి నెలా సమావేశం నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం నిర్ణయించింది. పంచాయతీలలో అన్ని అభివృద్ధి పనులు సమైఖ్యంగా అందరం కలిసి చేయాలని, అందుకు సర్పంచ్‌లు అందరూ ఐకమత్యంగా ఉండి ప్రజల డిమాండ్‌లను ప్రభుత్వానికి తెలియజేయాలని సమావేశం తీర్మానించింది. ఇందుకు సర్పంచ్‌లు అందరూ సహకరించాలని అధ్యక్షుడు దేవ మఝి విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థి బిభూతిని సన్మానిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి, తదితరులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా సమితి సీంద్రమాల పంచాయతీ ప్రాంతంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బిభూతి ముండాగుడియాను పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి చిత్తరంజన్ పాణిగ్రహి మంగళవారం సన్మానించారు. ఇట్టీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచింది. ఆటలపై ఉన్న ఇష్టాన్ని గమనించి కోరుకొండ సమితిలో స్వామీ శివానంద పాఠశాలలో క్రీడా ఉపాధ్యాయురాలు జ్యోత్స్న మహంతి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. కస్తూర్బా పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు సనాతన్ ప్రదాన్ కూడా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వంసతి పాటిల్, సిబ్బంది పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో గ్రామాలు



మోకాలి లోతు నీటిలో ప్రజా జీవనం



కలుషిత నీరే దిక్కు

భువనేశ్వర్: బ్రాహ్మణి, ఖరస్రోత, కాణీ నదులలో నీటి మట్టం పెరిగి వరద ముంపు పరిస్థితి ఏర్పడింది. దీంతో కేంద్రాపడా జిల్లాలో 17 గ్రామ పంచాయతీలు ప్రభావితమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సుమారు 70,000 మంది గ్రామస్తులు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. 10 గ్రామ పంచాయతీల పరిధిలో రోడ్డు రవాణాకు అంతరాయం కలిగింది. తాగునీటి కోసం గ్రామస్తులు కలవరపడుతున్నారు.

న్యూస్‌రీల్

బలవంతపు భూసేకరణ నిలిపేయాలి


రైతులు, వివిధ సంఘాల నాయకులతో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ, బలవంతపు భూసేకరణ నిలిపేయాలని కోరుతూ ఎయిర్‌పోర్టు బాధిత గ్రామాల్లో రైతులు, వామపక్ష నాయకులు, వివిధ సంఘాల నేతలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బలవంతపు భూసేకరణ చేస్తే ప్రతిఘటన తప్పదని వారంతా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఒంకులూరులో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రజల పక్షాన నిలుస్తూ వారికి ప్రయోజనాలను చేకూర్చేలా పాలన సాగించాలే తప్ప.. కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడుపోయి ప్రజల భూములను లూటీ చేసేలా వ్యవహరించడం తగదన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కార్గోఎయిర్ పోర్టుపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వ్యవసాయ శాఖ మంత్రివా లేక విధ్వంస శాఖ మంత్రివా అంటూ అచ్చెన్నాయుడిపై మండిపడ్డారు. కొబ్బరి, జీడి, మామిడి, పనస లాంటి పచ్చని పంటలతో విరాజిల్లుతున్న ఉద్దాన ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఢిల్లీలాంటి మహానగరంలో 150 ఎకరాల్లో మాత్రమే కార్గో ఎయిర్‌పోర్టు ఉంటే ఇక్కడ 1,400 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉద్దానం జీడి పంటను కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో నాశనం చేస్తే పర్యావరణంలో పాటు లక్షలాది మంది రైతులు, జీడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకట రమణ, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్‌రావు, సీపీఎంఎల్ లిబరేషన్ నాయకుడు ఎం.రామారావు, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

భళా మోక్షశ్రీ


అవార్డుతో మోక్షశ్రీ

శ్రీకాకుళం:

బలగలో నివాసముంటున్న వంజరాపు సాయికుమార్, రమ్య దంపతుల కుమార్తె మోక్షశ్రీ ప్రపంచ రికార్డు సాధించింది. రెండేళ్ల ఎనిమిది నెలల వయసులోనే కెమిస్ట్రీ సబ్జెక్టులోని 30 మూలకాలను 23.37 సెకెండ్లలో చెప్పి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించింది. జూలై 16న ఆన్‌లైన్ విధానంలో ఈ ఘనత సాధించింది. ప్రపంచ రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రం మంగళవారం తల్లిదండ్రులకు చేరింది. మోక్షశ్రీ తల్లి రమ్య మత్స్యశాఖలో సాగర మిత్రగా పనిచేస్తుండగా, తండ్రి సాయికుమార్ సిమెంట్ బొమ్మలను తయారు చేస్తుంటారు. వీరి స్వస్థలం హిరమండలం అయినప్పటికీ ఉద్యోగరీత్యా దంపతులు బలగలో నివాసముంటున్నారు.

అధికారులకు అవార్డులు


రాయగడ: బీడీఓలను సన్మానిస్తున్న దృశ్యం. పక్కనే కలెక్టర్ అశుతోష్


రాయగడ: బీడీఓలతో కలెక్టర్ కులకర్ణి, తదితరులు


పర్లాకిమిడి: పురస్కారం అందుకుంటున్న గజపతి జిల్లా కలెక్టర్ మధుమిత

రాయగడ: రాజధాని భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవనంలో బుధవారం ఆకాంక్ష జిల్లాల కలెక్టర్లు, సమితి కేంద్రాల అధికారులకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మఝి బుధవారం పురస్కారాలు అందజేశారు. రాయగడ జిల్లాలోని మునిగుడ, పద్మపూర్ సమితుల బీడీఓలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి కూడా పాల్గొన్నారు. గర్భిణుల నమోదు ప్రక్రియ, మధుమేహ స్క్రీనింగ్ పరీక్షలు, బీపీ, మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఆరోగ్య కార్డుల పంపిణీ తదితర అంశాల్లో సమర్థంగా బాధ్యతలను నిర్వర్తించినందుకు మునిగుడ బీడీఓ కృష్ణ చంద్ర దలపతికి కాంస్య పథకం, పద్మపూర్ బీడీఓ కురేష్‌కుమార్ జానీకి రజత పతకం ప్రదానం చేశారు.

☛ **పర్లాకిమిడి:** గజపతి జిల్లా కలెక్టర్ మధుమిత నాలుగు పతకాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. నీతి అయోగ్ ద్వారా 2018లో గుర్తించిన ఆకాంక్ష బ్లాకులు గుమ్మాబ్లాక్ బి.డీ.ఓ. దులారాం మరాండికి రజత పతకం, ఆర్.ఉదయగిరి బ్లాక్ బీడి.ఓ.లారీమాన్ ఖర్సల్‌కు కాంస్య పతకం, పూర్వ కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌కు ప్రత్యేక పురస్కారం అందజేశారు.


పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా, ఆర్.ఉదయగిరి బ్లాక్ అధికారులతో కలెక్టర్ మధుమిత

☛ **మల్కన్‌గిరి:** ఆరు విభాగాల్లో మల్కన్‌గిరి జిల్లా అధికారులు పతకాలు సాధించారు. పతకాలు అందుకున్న వారిలో పూర్వ కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పాటిల్, జిల్లా అభివృద్ధిఅధికారి నరేశ్‌చంద్ర శబర్, చిత్రకొండ సమితి బీడీఓ ప్రీతాకుమారీ, ఖోయిర్‌పూట్ బీడీఓ ఉమా శంకర్ కోయా, మత్తిలి బీడీఓ ప్రమోద్ కుమార్ బెహరా పతకాలు అందాయి.


మల్కన్‌గిరి: స్వర్ణ పతకాలు సాధించిన జిల్లా అధికారులు


మల్కన్‌గిరి: పతకం అందుకుంటున్న మల్కన్‌గిరి పూర్వ కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పాటిల్

ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవం


సమావేశంలో వివిధ ఆదివాసీ తెగల ప్రతినిధులు

జయపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు తొమ్మిదో తేదీన ఘనంగా నిర్వహించాలని జయపురం ఆదివాసీ సంఘాలు నిర్ణయించాయి. ఈ విషయమై స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో ఆదివాసీ సంఘ అధ్యక్షులు జితేంద్ర నాయిక్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించి చర్చించారు. సమావేశంలో జయపురం సమితి, మున్సిపాలిటీ ప్రాంతాలలోని ఎనిమిది ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హాజరై చర్చించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాడు సూర్యమహల్ కూడలి నుంచి పట్టణ ప్రధాన మార్గం మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు భ్యారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ర్యాలీలో కొరాపుట్ జిల్లాలోనిఅన్ని ఆదివాసీ తెగల ప్రజలు తమ సంప్రదాయ దుస్తులతో పాల్గొనాలని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఏటా లాగనే ఈసారి కూడా ఉత్సవాలను అంగరంగ వైభవంగా.. ధూంధాంగా నిర్వహించాలని నిశ్చయించారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు సూర్యమహల్ ప్రాంతానికి బొండా బాగ్ మందిరం వద్ద గదబ, పరజ, పెండియ, అమనాత్య, భొత్ర, కంధ, భూమియ మొదలగు సాంప్రదాయ ఆదివాసీ ప్రజలు చేరుకోవాలన్నారు. అక్కడ బొండాబాగ్‌కు పూజలు చేసి బయలు దేరే ర్యాలీలో ఆదివాసీ ప్రజలు సంప్రదాయ దుస్తులతో పాల్గొనేలా చూడాలని సమావేశం వెల్లడించింది. అలాగే వివిధ ఆదివాసీ నృత్య, వాయిద్యాలు, సంగీతాలతో పాల్గొంటాయని సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు వెల్లడించారు. ర్యాలీ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరిన తరువాత ఆదివాసీ ప్రజల వివిధ సమస్యలపై సబ్‌కలెక్టర్ మెమోరాండం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో జయపురం సమితి చైర్మన్ తిలోత్తమ ముదులి, అమనాత్య సమాజ్ ఉపాధ్యక్షులు ప్రఫుల్ల అమనాత్య, పెండియ సమాజ్ ఉపాధ్యక్షులు టంకుధర హల్వ, జయపురం పట్టణ పరజ సమాజ్ బాసుదేవ్ నాయిక్, రొండాపల్లి సర్పంచ్ ఆనంద హల్వ, అంత గ్రామ సర్పంచ్ బాబుల దిసారి, సౌర సమాజ్ అధ్యక్షులు దొయితారి సౌర, కార్యదర్శి చరణ సౌర, పారజ సమాజ్ ప్రతినిధి బేణు నాయిక్, గదబ సమాజ్ ప్రతినిధి జుదిష్టర్ గదబ తదితరులు పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల విజృంభణ

సారవకోట: గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. కొంతమంది ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తుండగా మరికొందరు సమీప పీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. సారవకోట, చోడసముద్రం, చిన్నగుజ్జువాడ తదితర గ్రామాల్లో జ్వరాల తీవ్రత అధికంగా కనిపిస్తోంది. తర్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతుండటంతో సారవకోట పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు దోమలు, ఈగల ఉధృతి పెరగడం వ్యాధుల విజృంభణకు కారణమని తెలుస్తోంది.

ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, హమాలీలు, కార్మికులు

ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపోను విడదీసి, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి 3 తరాలుగా డిపోలో పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టవద్దని కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు బుధవారం ధర్నా నిర్వహించారు. 1986లో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి 100 మంది దళిత కుటుంబాలకు చెందిన 4 ఎకరాల భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకొని, ఎచ్చెర్లలో యారక్ బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాలకు కార్మికులుగా, హమాలీలుగా ఉపాధిని కల్పించారన్నారు. అనంతరం ఐఎంఎల్ డిపోగా మారిన ఈ కేంద్రంలో పనిచేస్తూ 350 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఎచ్చెర్లలో సొంత గోడౌన్లలో మద్యం సరఫరా చేస్తుంటే, అదనంగా టెక్కలిలో మరో డిపో అద్దెకు తీసుకుని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. దీనివలన అద్దెల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా, వినతిపత్రాలు అందించినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సురేష్, రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కేవీ రమణ పాల్గొన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై సర్వే


భూమిని పరిశీలిస్తున్న రెండు జిల్లాల అధికారులు

జి.సిగడాం: మండల కేంద్రంలోని 92/8 సర్వే నంబరులో ఉన్న భూమిని కొంతమంది ఆక్రమించి కల్యాణ మండపంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఇటీవల పి.జగదీశ్వరరావు అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 14వ తేదీన మండల సర్వేయర్, తహసీల్దార్ సమక్షంలో సర్వే చేపట్టారు. వీరు చేసిన సర్వే సక్రమంగా లేదని, జిల్లాస్థాయి అధికారులతో సర్వే చేపట్టాలని జగదీశ్వరరావు మరలా కోరారు. దీంతో బుధవారం లోకాయుక్త అధికారి సమక్షంలో ఆ భూమిని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఏడీలు కె.రమేష్, కె.రమణమూర్తి, డీఐవోలు అనుపోజు వెంకటేశ్వరరావు, ఎ.మన్మథరావు అధ్వర్యంలో సర్వే చేపట్టారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వెల్లడించారు.

- టెక్కలి పాత ఆస్పత్రిలో అధ్వానంగా మార్చురీ
- మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు
- కొత్త ఆస్పత్రిలో పూర్తికాని పనులు

మృతదేహాలకు భద్రతేదీ..!


మౌలిక సదుపాయాలు లేని మార్చురీ విభాగం

టెక్కలి:

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం వద్ద మార్చురీ విభాగం పూర్తిగా దీనావస్థకు చేరుకుంది. కొత్త ఆస్పత్రిలో మార్చురీ విభాగం పనులు పూర్తి కాకపోవడంతో, పాత ఆస్పత్రికి ఆనుకుని మార్చురీ విభాగం కొనసాగుతోంది. అయితే ఇక్కడ విద్యుత్, ఫ్రీజర్ సదుపాయం, కనీసం సెక్యూరిటీ సిబ్బంది కూడా అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఒక్కోసారి చీకటిపడిన తర్వాత మార్చురీలో భద్రపరిచిన మృతదేహాలకు కనీసం భద్రత లేని దుస్థితి చోటు చేసుకుంటోంది. దీనిపై పలు సందర్భాల్లో మృతుల బంధువులు ఆస్పత్రి సిబ్బంది బహిరంగంగానే ఆందోళన చేసినప్పటికీ పరిస్థితి మాత్రం చక్కబడడం లేదు. మార్చురీ వద్ద ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో మృతుల బంధువులే కాపలా కాసుకునే దుస్థితి దాపురిస్తోంది.


టెక్కలి కొత్త ఆస్పత్రి వద్ద నత్తనడకన సాగుతున్న మార్చురీ భవనం పనులు

నత్తనడకన పనులు

ఇదిలా ఉండగా కొత్త ఆస్పత్రిలో మార్చురీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతే కాకుండా ఆస్పత్రికి వెనుక వైపు మార్చురీ నిర్మాణం చేయాలని సూచనలు ఉన్నప్పటికీ, అవేమీ పట్టించుకోకుండా పాత గేటు మార్గంలో ఓపీకి ఎదురుగా మార్చురీ భవనం నిర్మాణం చేస్తుండడంతో అనేక విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఏది ఏమైనప్పటికీ టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన మార్చురీ విభాగంలో ఎటువంటి మౌలిక సదుపాయలు లేక దీనావస్థలో ఉండడం, మరోవైపు కొత్త ఆస్పత్రి వద్ద మార్చురీ భవన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండడంతో మృతదేహాల భద్రతపై నిర్లక్ష్యం కనిపిస్తోంది.

వైద్యం దయనీయం



మంత్రి అచ్చెన్నాయుడి సొంత నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్యం దయనీయంగా మారిందని చెప్పడానికి మార్చురీ విభాగం దుస్థితి ఒక నిదర్శనం. కొన్ని నెలల క్రితం కొత్త ఆస్పత్రి వద్ద మార్చురీ భవనం పనులు ప్రారంభించినప్పటికీ అవి నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పాత ఆస్పత్రి వద్ద మార్చురీ విభాగంలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోట మృతదేహాలను భద్రపరుస్తున్నారు. ఇటువంటి పరిస్థితి లేకుండా అధికార యంత్రాంగం స్పందించాలి.

– సత్తారు సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెక్కలి

పనులు పూర్తయితే తరలిస్తాం



కొత్త ఆస్పత్రిలో ఆగస్టు నెలాఖరులోగా మార్చురీ భవనం పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ఆ భవన నిర్మాణం పనులు పూర్తయితే మార్చురీని తరలిస్తాం.

– సూర్యారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్, టెక్కలి

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె


తలకొరివి పెడుతున్న కుమార్తె అనూరాధ

సరుబుజ్జిలి: కుమారుడు ఉన్నప్పటికీ జబ్బుతో మంచానపడడంతో తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన సరుబుజ్జిలి మండలంలో చోటుచేసుకుంది. నందికొండ కాలనీకి చెందిన కూన సింహాచలం పక్షవాతంతో ఐదేళ్లుగా బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కుమారుడు కూడా గత కొద్ది సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. అలాగే పెద్ద కుమార్తె అందుబాటులో లేకపోవ డం వలన, పురుషోత్తపురం గ్రామానికి చెందిన చిన్న కుమార్తె పైడి అనూరాధ తండ్రి చితికి నిప్పుపెట్టి రుణం తీర్చుకుంది.

అవినీతి తిమింగలం గోవిందరాజులు

- ఆయనకు వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత లేదు
- మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి:

కోటబొమ్మాళి మండలంలో బోయిన గోవిందరాజులు అనే వ్యక్తి ఒక అవినీతి తిమింగలమని, అతడికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని మేజర్ పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎంపీటీసీ కె.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కె.విశ్వనాథరెడ్డి, డబ్బీరు ప్రదీప్‌లు మండిపడ్డారు. ఇటీవల టీడీపీ నాయకుడు గోవిందరాజులు చేసిన విమర్శలను ఖండిస్తూ బుధవారం కోటబొమ్మాళిలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రను తాకట్టుపెట్టిన నాయకులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులు అని, అందుకే ఈరోజు వారికి రాష్ట్ర, కేంద్రమంత్రి పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. కోటబొమ్మాళిలో సర్వే నంబర్ 280/6లో 20 ఎకరాలు కొనుగోలు చేసుకు ని, ఆ స్థలానికి ఆనుకుని ఉన్న సుమారు 10 ఎకరా ల కొండ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి గోవిందరాజులు అని మండిపడ్డారు. కోటబొమ్మాళి పంచాయతీలో సుమారు 28.34 ఎకరాల చెరువులో దాదాపు 8 ఎకరాలు ఆక్రమించుకుని, ఆ భూమిలో గోవిందరాజులు రైస్ మిల్లు, వాణిజ్య సముదాయాలు నిర్మించుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. సుమారు 40 ఏళ్ల టీడీపీ పాలనలో కింజరాపు కుటుంబం అండతో ప్రజలు, రైతులను మోసం చేసి, బ్యాంకులను బురిడీ కొట్టించి కోట్లాది రూపా యల సొమ్మును కాజేసిన వ్యక్తి గోవిందరాజులు అని దుమ్మెత్తిపోశారు.

విమర్శలు చేయడం విడ్డూరం

బ్యాంకు రుణాలు తీసుకుని, వాటిని కట్టకుండా రాజకీయ అండతో అక్రమాలకు పాల్పడిన గోవిందరాజులు వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో ఆయనతో పాటు ఆయన సోదరుడికి ఎంత అప్రతిష్ఠ ఉందో రైస్ మిల్లర్లకు తెలుసునని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో చేసిన అభివృద్ధి కనిపించలేదా అని నిలదీశారు. మూలపేట పోర్టు, ఉద్దానం కిడ్నీ ఆస్పత్రి, ఉద్దానం ప్రాంతానికి సురక్షితమైన నీరు వంటి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని గుర్తు చేశారు. కింజరాపు కుటుంబం దోచుకుంటున్న సొమ్ముతో పావలా వడ్డీకి డబ్బులు తెచ్చుకొని, వాటితో దోపిడీలు చేస్తున్న గోవిందరాజులు వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అతని అవినీతి బండారం మొత్తం బయటపెడతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, మండల నాయకులు రోణంకి ఉమా మల్లయ్య, బి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో విస్తారంగా వరి సాగు
- అధిక దిగుబడులకు సూక్ష్మ పోషకాలు కీలకం
- చర్యలు తీసుకోవాలని అధికారుల సూచనలు


ఖరీఫ్ వరినారులో కనిపిస్తున్న సూక్ష్మధాతు లోపం

సూక్ష్మంతోనే.. దిగుబడులకు మోక్షం..!


టి.భవానీ శంకర్

కవిటి: ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ వరిసాగు విస్తృత స్థాయిలో సాగుతోంది. సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో పంటల్లో అధిక దిగుబడుల సాధనకు రైతులు తీవ్రంగా ఆలోచిస్తున్నారు. అయితే పంటల పెరుగుదలకు సూక్ష్మ పోషకాల ఆవశ్యకత ఎంతో అవసరమని సోంపేట సబ్ డివిజన్ ఏడీఏ టి.భవానీశంకర్ తెలిపారు. నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్నా, సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే పంటల దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. జింక్, ఇనుము, బోరాన్, రాగి, మాంగనీస్, మాలిబ్డినం, క్లోరిన్ వంటి మూలకాలను సూక్ష్మపోషకాలు అంటారు. నేలలో ఏ ఒక్క సూక్ష్మ పోషక పదార్థం లోపం ఉన్నా సరైన ఫలితం ఇవ్వదు. అందువలన నేలలోనే వాటికి సంబంధించిన ఎరువులను వేసుకొని పంట లోపాలు నివారించుకోవాలని సూచించారు.

జింక్: మొక్కల పెరుగుదలకు అవసరమైన నత్రజని, భాస్వరం వంటి పోషకాల సమర్థ వినియోగానికి జింక్ చాలా అవసరం.

లోపం: జింక్ లోపం ఉంటే మొక్క పైనుంచి మూడు లేదా నాలుగు ఆకుల్లో మధ్య ఈనే పాలిపోతుంది. నాటి న రెండు నుంచి నాలుగు వారాల్లో ముదురాకు చివర్లలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. ఇది మిగతా ఆకు అంతటా వ్యాపిస్తుంది. ఆకులు గిడసబారి దుబ్బు చేయవు. పైరుకు నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చగా ఉండదు

నివారణ చర్యలు: వరి పండించే భూముల్లో ప్రతీ మూడు సార్లుకు ఒకసారి, రబీ సీజన్ రెండు పంటలు పండించే భూముల్లో ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ చల్లుకోవాలి. భాస్వరం ఎరువుతో జింక్ సల్ఫేట్ కలిపి వేయరాదు. వీటి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. జింక్ సల్ఫేట్ వేయలేని పరిస్థితుల్లో పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి.

ఇనుము: ఆకుల్లో పత్రహరితం తయారు కావడానికి ఇను ము ఆధారం. ఇది పిండి పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. అధిక క్షార భూముల్లో, సున్నపు రాయి పాలు ఎక్కువగా గల నేలలు, తేలిక నేలల్లో, సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న నేలల్లో ఇనుప దాతు లోపాలు కనిపిస్తాయి. మెట్టవరి, మెట్ట నారుమళ్లలో ఇనుప దాతులోపం సాధారణంగా కనిపిస్తుంది.

నివారణ చర్యలు: ఒక లీటర్ నీటికి 20 గ్రాముల అన్న భేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పులో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని ఐదు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేసుకోవాలి. ఇక మిగతా సూక్ష్మ పోషకాలు తక్కువ మోతాదులో అవసరం అవుతాయి. మార్కెట్లో అన్ని సూక్ష్మ పోషకాల మిశ్రమం ఆగ్రోమినిమార్క్స్ రూపంలో ఫార్ములా–4 రూపంలో లభ్యమవుతాయి. సూక్ష్మ పోషకాల అవసరాన్ని బట్టి పైరులో వీటిని తగిన సమయంలో వాడి అధిక దిగుబడి పొందవచ్చు.

సూక్ష్మధాతు లోపాల నివారణ చర్యలు

మట్టి పరీక్ష: నేలలో ఏ సూక్ష్మధాతువు లోపించిందో తెలు సుకునేందుకు పంటకాలం ప్రారంభానికి ముందు మట్టి పరీక్ష చేయించుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: మట్టిపరీక్ష ఫలితాల ఆధారంగా సూక్ష్మధాతువులను అందించే ఎరువులను అందించాలి.

పచ్చిరొట్ట పైర్లసాగు: సూక్ష్మధాతు లోపాల నివారణ కు సేంద్రియ వ్యవసాయ విధానాలు మేలు చేస్తా యి. ఇందులో ప్రధానంగా పంట సీజన్ ప్రారంభంలో కుళ్లిన పశువుల గత్తం, వర్మీ కంపోస్టును భూమి లో చల్లుకొని కలియదున్నాలి. జీలుగు, పిల్లిపెసర, నవధాన్యాల సాగువంటి విధానాలతో పచ్చిరొట్ట పైర్లను పెంచి దమ్ము సమయంలో వీటిని భూమిలో కలియదున్నాలి. దీనికి అదనంగా ఎకరానికి కనీసం 100 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్‌ను పైపాటుగా వేసుకుంటే పచ్చిరొట్ట పైరును బాగా కుళ్లిస్తుంది. దీని ద్వారా ఆ భూమిలో సేంద్రియ కర్బనంతో పాటుగా సూక్ష్మధాతువుల స్థిరీకరణకు సహాయపడుతుంది.

క్లుప్తంగా

దేశం కోసం మధ్యవర్తిత్వం


జిల్లా జడ్జి ఎం. బబిత

విజయనగరం లీగల్: మధ్యవర్తిత్వం అనే ప్రక్రియ చాలా సులువైనది, ఖర్చు లేనిదని ప్రజల్లోకి దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షురాలు ఎం. బబిత అన్నారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాలతో బుధవారం జిల్లా కోర్టు చాంబర్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం కోసం కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న న్యాయమూర్తులంతో భౌతిక సమావేశం, ఇతర ప్రాంతాల్లో ఉన్న న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమం దేశ వ్యాప్తంగా 90 రోజుల పాటు నిర్వహిస్తున్నార న్నారు. ముఖ్యంగా మనోవర్తి కేసులు ప్రమాద బీమా కేసులు గృహ హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వాణిజ్యపరమైన తగాదా కేసులను సులువుగా ఈ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి పాముకాటుపై విచారణ


ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న ఐటీడీఏ పీఓ శ్రీవాస్తవ, డీఈఈ సంతోష్ కుమార్

సాలూరు రూరల్: మండలంలోని తోణాం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి మంగళవారం పాముకాటుకు గురైన విషయమై ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం తోణాం ఆశ్రమ పాఠశాల వార్డెన్ లచ్చయ్యను విచారణ చేశారు. విద్యార్థి బయటకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందన్న విషయంలో పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానానికి నీళ్ల అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తోందని ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వార్డెన్ తెలిపారు. డీఏ జుగా నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపడతామని విచారణ అనంతరం పీఓ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెల్లిమర్ల రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని చంపావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్‌ఓ వెంకట్రావు బుధవారం పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పంప్ హౌస్ సమీపంలో తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ తవ్వకాలు జరుపుతున్న వ్యక్తికి జరిమానా విధిస్తామన్నారు. సొంత అవసరాలకు మాత్రమే ఎడ్ల బండ్లపై ఇసుకను తరలించే వీలుందని, భారీ వాహనాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐటీడీఏ పీఓ దృష్టికి తాగునీటి సమస్య

పాచిపెంట: మండలంలోని కొత్తవలస గ్రామంలో తాగునీటి సమస్యను గ్రామస్తులు సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ్ దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం కొత్తవలస గ్రామానికి వచ్చిన ఐటీడీఏ పీఓ గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ క్రమంలో గతకొన్ని నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని , ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు తెలపగా పక్కనే ఉన్న ఎంపీడీఓతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. గ్రామ సమీపంలో గల చెరువులో లార్వా దోమలపై డ్రోన్ ప్రయోగాన్ని, స్థానిక పత్తి పంటలో డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీని పరిశీలించారు.

పరారైన చిట్టీల నిర్వాహకురాలు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన చిట్టీల నిర్వాహకురాలు వారణాసి జయలక్ష్మి పరారైనట్లు ఆమె వద్ద చిట్టీ కట్టిన బాధితుల ద్వారా బయటపడింది. సుమారు రూ.రెండు కోట్ల వరకు ఆమె టోపీ పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తుండగా 45మందికి రూ.90లక్షల మేర బాకీలు ఉన్నట్లు ఐపీ నోటీసులు పంపించడంతో ఒక్కసారిగా ఆమె పరారైన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తన ఆస్తి రూ.రెండు లక్షల వరకు ఉంటుందని, అది తప్ప తన వద్ద ఇంకేమీ లేవని ఐపీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. చిట్టీల నిర్వహణలో ఆమెకు సహకరించిన బంధువులు కూడా ఇటీవల పరారీలో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా ఆమె చిట్టీల నిర్వహిస్తోంది. అయితే అకస్మాత్తుగా పరారీ కావడంతో కాలనీవాసుల్లో ఆందోళన మొదలైంది. చిట్టీల బాధితులు ఎంతమంది? ఎంతమేరకు నష్టపోయారనేది తేలాల్సి ఉంది.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

విజయనగరం ఫోర్ట్: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎం.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ శివారా అన్నారు. కళాశాలలో బుధవారం నేచర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తెలిపారు. 2024 నివేదిక ప్రకారం అక్రమ రవాణా బాధితుల్లో 61 శాతం మంది మహిళలేనని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి జి.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో చిన్నంనాయుడు, శర్మ, విష్ణు, ఎస్‌సీసీ అధికారి కళ్యాణ్ అశోక్, చైతన్య, బంగారుబాబు, కృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు జ్వరమొచ్చింది..!

- మంచాన పడిన జనం
- ఎక్కడా కానరాని ఫీవర్ సర్వే
- పట్టించుకోని అధికారులు


ఈ ఫొటోలో మంచంపై ఉన్న మహిళ పేరు సింహాచలం. ఈమెది మెంటాడ మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధి జీడికవలస. జ్వరంతో మూడు రోజులుగా మంచంపైన ఉంటోంది. ఈమెతో పాటు మరి కొంత మంది లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని ఏడు గిరిజన గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగం వద్ద చికిత్స కోసం వచ్చిన జ్వరపీడితులు

విజయనగరం ఫోర్ట్: జిల్లావ్యాప్తంగా అనేక మంది జ్వరాల బారిన పడి బాధపడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధుల వ్యాప్తి అధికంగా ఉంటోంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధులను అదుపు చేయాలంటే సకాలంలో వాటిని గుర్తించగలగాలి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సకాలంలో చికిత్స అందించగలిగితే ప్రాణాపాయం నుంచి తప్పించడానికి అవకాశం ఉంటుంది. జ్వరపీడితులను త్వరగా గుర్తించాలంటే ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలి. కాని కూటమి ప్రభుత్వంలో ఫీవర్స్ సర్వే ఎక్కడా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జ్వరపీడితులను గుర్తించడంలో అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆస్పత్రులకు వెళ్తున్న జ్వరపీడితులు

రెండు, మూడు రోజుల పాటు జ్వరం ఉన్నవారు ఏజ్వరమో తెలుసుకోవడానికి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తుండగా మరి కొంత మంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆస్పత్రుల్లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. కొంత మంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచానపడి మూలుగుతున్నారు.

గత ప్రభుత్వంలో ఇంటింటా ఫీవర్ సర్వే

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటా ఫీవర్ సర్వేను ముందుగానే చేపట్టేవారు. జిల్లాలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు సర్వే చేసేవారు. వారికి వలంటీర్లు కూడా సహాయం చేసేవారు. ఇంటిలో ఎవరికైనా జ్వరం, దగ్గు, జలుబు ఉన్నాయా అని రెండు మూడు విడతలుగా సర్వే చేసేవారు. దీని వల్ల జ్వరపీడితులందరినీ గుర్తించి చికిత్స అందించడానికి వీలుండేది. మలేరియా, డెంగీ వంటి లక్షణాలుంటే వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించి, నిర్ధారణ చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించేవారు.

జిల్లాలో ఆచూకీ లేని సర్వే

గతంలో మాదిరి నేడు జిల్లాలో ఎక్కడా ఫీవర్ సర్వే జరగడం లేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉన్నప్పటికీ బాధితులను గుర్తించి సేవలు అందడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రెండు లక్షలకు పైగా జనం జ్వరాల బారిన పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం అధికంగా జ్వరపీడితులు చేరి చికిత్స పొందుతున్నారు. కొంతమంది ఓపీలో చికిత్స తీసుకుంటుండగా, మరి కొంతమంది ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు.

జ్వరాల వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు

జిల్లాలో ఫీవర్ సర్వే చేపట్టాం. అవసరమైతే మరోసారి సర్వే చేయిస్తాం. జ్వరాల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.
డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్‌పై రైతుల అభ్యంతరం


రైతులతో సమావేశమైన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్

లక్కవరపుకోట: ఇప్పటికే విలువైన పంట భూములను ఐఓసీఎల్ పైప్‌లైన్, హైపవర్ విద్యుత్ లైన్, గ్రీన్ ఫీల్డ్ హైవే తదితర ప్రాజెక్టుల కోసం లాక్కున్నారని పరిహారం మాత్రం తూతూ మంత్రంగా అందించారని మరో ప్రాజెక్టుకు భూములను ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు లక్కవరపుకోట మండల కేంద్రంలో గల ఎంపీడీఓ కార్యాలయంలో విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు హిందుస్థాన్ పెట్రోల్ కార్పొరేషన్ కు చెందిన పైప్ లైన్ నిర్మాణానికి సంబంధించి శ్రీరాంపురం, కొట్యాడ, కూర్మవరం గ్రామాల రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుధాసాగర్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విలువైన పంట భూముల్లో అడ్డుగా పైప్‌లైన్ వేస్తే భవిష్యత్ అవసరాలకు భూములను అమ్ముకోదలిస్తే కొనేందుకు ఎవరూ ముందుకు రారని వాపోయారు. పైప్‌లైన్ నిర్మాణానికి సేకరించిన భూమికి మార్కెట్ విలువలో కేవలం 10 శాతం మాత్రమే పరిహారం చెల్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పైప్‌లైన్ నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెగేసి చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిప్యూటీ మేనేజర్ ఎం.లక్ష్మణ్, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, విశ్రాంత తహసీల్దార్ జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో ఆగస్టు 9,10,11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరగనున్న జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆగస్టు 3న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. నగర శివారులో గల విజ్జీ స్టేడియంలో నిర్వహించే ఎంపికల్లో అండర్-14,16,18,20 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలు పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మానవ అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరం

- సీనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: మానవ అక్రమ రవాణా హేయమైన చర్య అని ఇది వ్యవస్థీకృత నేరమని ఈ దోపిడీని అంతం చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు.ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని మహిళా ప్రాంగణంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మహిళలు చిన్నపిల్లలను అక్రమ రవాణాకు పాలపడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ రవాణా బాధితుల హక్కుల రక్షణ వారి భద్రతలే ప్రధాన అంశంగా పోలీస్ యంత్రాంగం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనిచేస్తుందని అక్రమ రవాణా బాధితులకు రక్షణ నష్టపరిహారం, పునరావాసంతో పాటు వారికి తగిన న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థతో పాటు పోలీసు యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. పిల్లల అక్రమ రవాణాపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ మహిళా పోలీస్ స్టేషన్ ఆర్.గోవిందరావు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి టి.విమల కుమారి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్‌డీవీ ప్రసాద రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి హిమబిందు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బీహెచ్ లక్ష్మి, పోలీస్ అధికారులు, యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రసాద రావు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ


ఉపముఖ్యమంత్రి పంపిన రగ్గులతో గిరిజనులు

మక్కువ/పార్వతీపురం రూరల్: మక్కువ మండలంలోని ఆరు గిరిజన గ్రామాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రగ్గులను పంపించారు. ఈ మేరకు బుధవారం ఆ 6 గిరిజన గ్రామాల్లో రగ్గుల పంపిణీ జరిగింది. మండలంలోని బాగుజోలలో 24, చిలక మెండంగి, బెండమెడంగి, తాడిపుట్టి, దోయ్ వర, సిరివర, గిరిజన గ్రామాల్లో 222 కుటుంబాలకు, కుటుంబానికి మూడు రగ్గులు చొప్పున పంపిణీ చేశారు.

దుకాణాల అద్దెలు చెల్లించాలి


అద్దె షాపుల యజమానులతో మాట్లాడుతున్న సహాయ కమిషనర్

విజయనగరం: నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాల అద్దె బకాయిలను చెల్లించాల్సిందేనని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. బుధవారం ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాలలో బకాయి ఉన్న యజమానులకు అద్దె చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 157 దుకాణాలు ఉండగా వాటిలో 49 దుకాణదారులు అద్దెబకాయిలు ఉన్నట్టు గుర్తించారు. లక్ష రూపాయలు పైబడి బకాయి ఉన్న దుకాణాలు 15 వరకు ఉన్నట్టు గుర్తించారు. దీర్ఘకాల, మొండి బకాయిలు ఉన్న దుకాణాలకు సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ బృందంతో వెళ్లి బకాయి వసూళ్లకు పట్టుబట్టారు. దీంతో కొంతమంది గురువారంలోగా చెల్లిస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోపు బకాయిలు చెల్లించకుంటే దుకాణాలను మూసివేయడంతో పాటు తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


సూరిదేముడు మృతదేహం

గంట్యాడ: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. గంట్యాడ మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కొల్లి సూరిదేముడు (41) బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో కాలకృత్యాల కోసం అయ్యన్నబంద చెరువుకు వెళ్లాడు. కాలు జారి చెరువులో పడిపోగా లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. అక్కడే ఉన్న రీసు అప్పన్న గ్రామంలోకి పరుగున వెళ్లి జనాలను తీసుకొచ్చి సూరిదేముడిని బయటకు తీయగా అప్పటికే మరణించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కృష్ణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో పడి మరో వ్యక్తి..


రమేష్ మృతదేహం

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామ శివారులో గల చిన్న రాయుడు చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం మృతదేహం పైకి తేలి కనిపించడంతో స్థానికులు పార్వతీపురం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామంలోని బజారు వీధికి చెందిన సింగిరెడ్డి రమేష్ (35) పొలం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ వ్యక్తి పశువులను శుభ్రం చేసేందుకు చెరువులో దిగి ఈత రాక ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమార్తె ఉంది. జరిగిన సంఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని కందివలస సంత సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కందివలస సంత ఏరియాలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న వ్యక్తి మూర్ఛ వ్యాధితో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పూసపాటిరేగ పోలీసులు కోరారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల కొట్లాట

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల పంచాయతీ మత్స్యవానిపాలెంలో ఇరువర్గాలు కొట్లాటకు దిగడంతో పలువురుకి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మత్స్యవానిపాలెంకు చెందిన కోళ్ల స్వాతి పెళ్లి విషయంలో కోళ్ల, పళ్ల కుటుంబాల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో పళ్ల లక్ష్మణరావు, కోళ్ల అప్పలనర్సయ్య కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడంతో ఇరు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు.

సోషల్ మీడియా పోస్టులపై ఎస్పీ కన్నెర్ర

- అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు
- నెటిజన్స్‌కు హెచ్చరిక


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాలో అనుచితమైన పోస్టులు పెట్టవద్దని ఎస్పీ వకుల్‌జిందల్ కోరారు. కుల, మత, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిపైన, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని బుధవారం ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ మతాలను, కులాలను, రాజకీయ పార్టీలను రెచ్చగొడుతూ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇనస్టాగాం, యూట్యూబ్, టెలిగ్రాం, వాట్సాప్, లింకిడిన్ వంటి ద్వారా మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా నిఘా పెట్టిందన్నారు. ఇందుకుగాను ఒక పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కాగా జిల్లాలోని డెంకాడ మండలం టి.కళ్లాలు (చిన మోపాడ)లో ఓ ప్రార్థనా మందిరం ఆవరణలో ఉన్న విగ్రహంపై చెట్టు కొమ్మ పడి విగ్రహం పాడైపోతే, ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, అరెస్టు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వినియోగిస్తున్న ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని కోరారు. వాస్తవాలను తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టేటపుడు ఇతరుల మతాలు, కులాలు, మనోభావాలకు, వ్యక్తిత్వానికి భంగం కలిగించకుండా ఉండాలని హితవు పలికారు.

పోటా పోటీగా హ్యాండ్‌బాల్ పోటీలు


హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయలో హైదరాబాద్ రీజియన్ హ్యాండ్‌బాల్ మీట్ -2025-26 పోటీలు రెండవ రోజు మంగళవారం హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 195 మంది, బాలురు, 183 మంది బాలికలు అండర్-19, అండర్-17, అండర్-14 విభాగాల్లో తలపడుతున్నారు. పోటీలకు వచ్చిన దక్షిణ భారతదేశంలోని నవోదయ విద్యాలయాలైన యానాం, ఆదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకుళం, హావేరి, హాసన్, కలబుర్గిల నుంచి వచ్చిన విద్యార్థులు పోటాపోటీగా తలపడుతున్నారు. గురువారం విజేతలను నిర్ణయించి బహుమతి ప్రదానం చేస్తామని, విజేతలు బీహార్‌లో నలందలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రాజారావు చెప్పారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికకు నోటిఫికేషన్


ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తున్న సంఘం నాయకులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు వచ్చేనెల 16న స్థానిక జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహిస్తామని ప్రస్తుత జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.మురళి, ఎ.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్నిక నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసి జిల్లా శాఖ కార్యాలయం నోటీస్ బోర్డులో ప్రదర్శనకు ఉంచినట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎన్నికలకు పరిశీలకులుగా విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీఓ జాయింట్ సెక్రటరీ ఎన్ఎంకేజీప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు టి.శ్రీధర్‌బాబు, సహాయ ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా పట్టణ ఏపీఎన్‌జీఓ అసోసియేట్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు నియమితులయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్‌లలో ఉన్న ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని ఎన్నికల అధికారి శ్రీధర్ కోరారు. నోటిఫికేషన్ విడుదల కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, రమణమూర్తి, ఆంజనేయ వర్మ, పరిషత్ యూనిట్ అధ్యక్షులు కేఎస్.శ్రీనివాసరావు, ఎల్వీ ప్రసాద్, వీవీరమణమూర్తి, ఎం.హేమలత, వనిత, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పెద్ద పీట

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసిన వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ

సాలూరు: రానున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేయనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ,శ్రీకాకుళం,పార్వతీపురం మన్యం జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వీర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల స్థాయి అనుబంధ విభాగాల కమిటీల నియామకం ఇప్పటికే పూర్తయిందన్నారు. గ్రామ, వార్డు స్థాయి కమిటీల నియామకం త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. మంగళవారం తాడేపల్లిలో జరిగిన పీఏసీ సమావేశంలో అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా రానున్న జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి , వారే రాజు మంత్రి అనే విధంగా కార్యకర్తలను చూసుకుంటామని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపిన విషయాలను ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో కూటమి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై చర్చించారు.

అన్నదాత సుఖీభవలో కోత


విజయనగరం మండలం జొన్నవలసలో దమ్ము చేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్: మెంటాడ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన దేవర పాదాలమ్మకు వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సాయం అందింది. కూటమి ప్రభుత్వం సాయం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో ఆమె పేరు లేదు. ఆమెకు రెండున్నర ఎకరాల పొలం ఉంది.

- బొండపల్లి మండలం బిల్లల వలసకు చెందిన ఎస్. శ్రీనుకు గ్రామంలో 65 సెంట్ల పొలం ఉంది. వైఎస్సార్‌సీపీ హయంలో ఈ రైతుకు రైతు భరోసా సాయం అందింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో ఈ రైతు పేరు లేదు.
- దత్తిరాజేరు మండలం వి.కృష్ణాపురం గ్రామానికి చెందిన మార్పిన సురేష్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో ఆ రైతు పేరు లేదు. ఈ ముగ్గురు రైతులే కాదు. అనేక మంది రైతులకు ఎదురైన సమస్య ఇది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం అందుకున్న వారికి కూడా కూటమి ప్రభుత్వంలో పథకం అందని పరిస్థితి నెలకొంది. అన్నదాత సుఖీభవ పథకం కోసం ఎంపిక చేసిన జాబితలో వేలాది మందికి కూటమి ప్రభుత్వం కోత పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు ఆర్థిక సాయాన్ని అందించింది. కానీ కూటమి సర్కార్ మొదటి ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న ఆర్థిక సాయం అందించలేదు. రెండో ఏడాది అన్నదాత సుఖీభవ పథకం కూడా ఇంతవరకు అందించిన పాపాన పోలేదు. అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వకపోయినప్పటికీ రైతులకు ఆర్థిక సాయం అందించడం కోసం అని చెప్పి గుర్తించిన లబ్ధిదారుల జాబితాలో భారీగా కోత విధించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నమ్మి ఓట్లు వేస్తే ఈ విధంగా కోత పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అప్పుడు అర్హులమై ఇప్పుడు ఏవిధంగా అనర్హులమ య్యామని రైతులు వాపోతున్నారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలనే కుట్రతోనే కూటమి సర్కార్ ఈ విధంగా చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో 2.63 లక్షల మంది రైతులకు లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2.63 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. వారికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.13,500 చొప్పన ఆర్థిక సాయం అందించింది. కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పథకం కోసం 2,24,356 మంది అర్హులను గుర్తించింది. ఇందులో 2,23,117 మందికి ఈకేవైసీ పూర్తయింది. 1239 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉంది. 40 వేలకు పైగా లబ్ధిదారులు గతంలో కంటే తగ్గిపోయారు.

ఇంకా అందని సాగు సాయం

అధికారంలోకి వస్తే రైతుల సాగు పెట్టుబడికి ఆర్థిక సాయం చేస్తామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. గద్దె నెక్కిన మొదటి ఏడాదే రైతులకు ఇచ్చిన హామీని ఎగ్గొట్టింది. రెండో ఏడాది ఇంతవరకు సాయం అందించలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అయితే రైతులకు పంట పెట్టుబడికి డబ్బులు లేక పోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. అప్పలు చేసి పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నారు.